క్లుప్తంగా

మినరల్ వాటర్ పంపిణీ



వెంకటాపురం(ఎం): మహాశివరాత్రి సందర్భంగా రామప్ప ఆలయానికి వచ్చిన భక్తులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గంగిశెట్టి సరస్వతి జ్ఞాపకార్థం ఉచితంగా మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాజు బుధవారం ప్రారంభించి మాట్లాడుతూ భక్తులకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నందుకు లయన్స్‌క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఈఓ బిల్ల శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ మెరుగు రమేష్, సెక్రటరీ చుంచు రమేశ్, సభ్యులు సానికొమ్ము రవీందర్‌రెడ్డి, కొండి సాంబశివ, సుబ్బారెడ్డి, ఆడెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడి మృతి



రాఘవరావు (ఫైల్)

కన్నాయిగూడెం: మండలంలోని తుపాకులగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయడిగా విధులు నిర్వహిస్తున్న కొర్నిబెల్లి రాఘవరావు (59) అనారోగ్యంతో మృతి చెందాడు. బాధితుల కథనం ప్రకారం.. తాడ్వాయి మండలం కామారం గ్రామానికి చెందిన రాఘవరావు కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండగా 20 రోజులుగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. గిరిజన ఉపాధ్యాయ సంసంక్షేమ సంఘాల్లో హక్కుల కోసం ఉద్యమాలు చేశారు. ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి



చిట్యాల : మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌కుమార్ బుధవారం సందర్శించారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఐ మల్లేష్, సిబ్బంది ఉన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మహాశివరాత్రికి వచ్చిన భక్తులకు కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బుధవారం మధ్యాహ్నం భక్తులకు సుమారుగా 300 ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు పవన్ శర్మ, బాబాతాజ్, శంకర్, సమీర్ తదితరులు ఉన్నారు.

జాతరలో వైద్యసేవలు

మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన దేవస్థానం ఆవరణ, బస్టాండ్, గోదావరి వద్ద మూడు చోట్ల వైద్యా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. బుధవారం జాతరకు వచ్చిన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి సుస్మిత, జిల్లా ప్రోగ్రాం అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మడికొండ చౌరస్తా సమీపంలోని విశాల్ మార్ట్ వద్ద బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ నుంచి భూపాలపల్లికి ఒడితల గ్రామానికి చెందిన మండల శేఖర్, గణేష్, ఒడిశాల శ్రీకాంత్ ఆటోలో వెళ్తున్నారు. జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు.. ఆ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి చికిత్స 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆయా మండల కేంద్రాల్లో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. బుధవారం అన్ని గ్రామాల్లో ప్రజలు, యువకులు, మహిళలు, శివసత్తులు ఉదయాన్నే లేచి స్నానాలు చేసి శివుడికి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏటూరునాగారం : సహస్ర ఘటాభిషేకం కోసం జంపన్నవాగు నుంచి జలాన్ని తీసుకువస్తున్న భక్తులు



వెంకటాపురం (కె) : మండల కేంద్రంలో ఊరేగింపు చేస్తున్న ప్రభ వాహనం



మంగపేట : మల్లూరు శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



మంగపేట : ధ్వజస్తంభం వద్ద టెంకాయలు కొట్టి పూజలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం : ఆలయంలో భక్తులకు హారతి ఇస్తున్న అర్చకులు



వాజేడు: పూజలు చేస్తున్న పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్



గోవిందరావుపేట : శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



వెంకటాపురం (కె) : ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ములుగు రూరల్ : పూజలు నిర్వహించిన మాజీ ఎంపీటీసీ నూనావత్ మహేష్‌నాయక్ దంపతులు



మంగపేట : ఆలయ ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం



ఏటూరునాగారం : ఏటూరునాగారంలో కల్యాణాన్ని చూసేందుకు హాజరైన భక్తులు



ఏటూరునాగారం : ఏటూరునాగారం శివాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం : శివపార్వతుల కల్యాణం సందర్భంగా మంగళసూత్రాలను చూపిస్తున్న అర్చకులు



వాజేడు: ప్రగళ్ల పల్లిల్లో స్వామి వారిని దర్శించు కుంటున్న భక్తులు

వాటర్‌ట్యాంకర్ టైరు పగిలి వృద్ధురాలికి గాయాలు



గాయపడిన రామలక్ష్మి

భువనగిరి టౌన్ : వాటర్ ట్యాంకర్ టైరు పగిలి అందులో నుంచి వేరుపడిన ఇనుప వస్తువు ఇంట్లో కూర్చొని ఉన్న వృద్ధురాలికి తాకడంతో ఆమెకు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం భువనగిరి పట్టణంలో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం .. భువనగిరిలోని అర్బన్ కాలనీకి చెందిన సత్యనారాయణరెడ్డి ఇటీవల మృతి చెందాడు. సత్యనారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు అతడి సోదరి రామలక్ష్మి ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపుర నుంచి భువనగిరికి వచ్చింది. బుధవారం రామలక్ష్మి ఇంట్లో కూర్చొని ఉండగా స్థానికంగా నీటిని సరఫరా చేసే ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ అటుగా వెళ్తుండగా దాని వెనుక టైరు పగిలింది. దీంతో టైరు నుంచి వేరుపడిన ఇనుప వస్తువు ఇంట్లో మంచంపై కూర్చొని ఉన్న రామలక్ష్మికి తాకింది. దీంతో ఆమె కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. వాటర్ ట్యాంకర్ ఫిట్‌నెస్ సరిగ్గా లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మల్లమ్మ (ఫైల్)

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామాని చెందిన 106 ఏళ్ల శతాధిక వృద్ధురాలు జక్కుల మల్లమ్మ బుధవారం మృతిచెందింది. మల్లమ్మకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, 28 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. మల్లమ్మ బుధవారం ఉదయం వరకు ఆరోగ్యంగా ఉంటూ తన పనులు తానే చేసుకునేది. ఆమె మృతి చెందడంతో గ్రామస్తులు బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఎస్సై తాజొద్దీన్



మాట్లాడుతున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెంలో మహాశివరాత్రి సందర్భంగా కాంగ్రెస్ యూత్ రాష్ట్ర నాయకుడు సూర్య ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా ఎస్సై హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, యువతలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. చెడు మార్గాలను వీడి క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. అనంతరం మొదటి స్థానంలో నిలిచిన రామన్నగూడెం జట్టుకు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన చిన్నబోయినపల్లి జట్టుకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో పెద్ది రాజబాబు, గుండెపు రాజు, ప్రణయ్, నవీన్, రామకృష్ణ, వాజేడు, ఏటూరునాగారం మండలాలకు చెందిన క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

నెలరోజులుగా మృత్యువుతో పోరాటం..

- చికిత్స పొందుతున్న యువకుడి మృతి



రక్షిత్ కుమార్ (ఫైల్)

చిట్యాల : తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి నెలరోజులుగా మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచిన సంఘటన మండలంలోని వెంచరామిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంచరామికి చెందిన దాసరి రక్షిత్‌కుమార్ (18) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే కూలీపని చేస్తూ తల్లిదండ్రులు దాసరి వాణి–యుగేందర్‌లకు ఆసరాగా ఉంటున్నాడు. ఈక్రమంలో గతనెల 27న ఇంట్లో తల్లిదండ్రులతో గొడవ పెట్టుకొని రక్షిత్ కుమార్ మద్యం తాగి వచ్చాడు. గమనించిన తల్లిదండ్రులు అతడిని మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పరకాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించా రు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. నెల రోజులుగా చికిత్స పొందుతున్న రక్షిత్‌కుమార్ పరిస్థితి విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి యుగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

రేగొండ : బావిలో దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భాగిర్థిపేటలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. మండలంలోని భాగిర్థిపేటకు చెందిన సుంకరి రవి (60) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా జబ్బు నయం కా లేదు. కాగా ఇటీవల వైద్యులు తన కాళ్లు తీసేయాలని తెలపడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో రెండ్రోజుల క్రితం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఎవరి ఇంటికైనా వెళ్లి ఉంటాడని భావించి బంధువులకు ఫోన్ చేసి ఆరా తీశారు. బుధవారం గ్రామంలోని ఓ వ్యవసా య బావినుంచి దుర్వాసన వస్తోందని గ్రామస్తులు గ్రహించి బావిలోకి చూడగా రవి మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు.

అంటుకుంటే మిగిలేది బుగ్గే

- అందుబాటులో లేని ఫైర్‌స్టేషన్..
- అగ్ని ప్రమాదాల్లో సర్వం కోల్పోతున్న బాధితులు
- వేసవి సమీపించడంతో ఆందోళన చెందుతున్న మండలవాసులు



శాంతినగర్‌లో దగ్ధమవుతున్న ఇళ్లు (ఫైల్)

టేకుమట్ల : పల్లెల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ మాత్రం ఏమరు పాటుగా ఉన్న క్షణాల్లో అగ్నికీలల్లో సర్వం దగ్ధం కావాల్సిందే. ప్రతీఏటా అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నప్పుడు స్థానికులు తీవ్రంగా కష్టపడుతూ మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అంతే కానీ ఫైరింజన్ రాని పరిస్థితి. మండల కేంద్రానికి భూపాలపల్లి, పరకాల ఫైర్‌స్టేషన్లు సుమారు 35 కిలో మీటర్ల దూరంలో ఉంటాయి. ఇక అగ్ని ప్రమాదం సంభవించిన క్షణాల్లో మంటలు వ్యాపిస్తాయి. అప్పుడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందిస్తే మండల కేంద్రానికి చేరుకునేందుకే సుమారు గంట సమయం పడుతుంది. మండలంలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా అధిక సమయం పడుతుండడంతో ఇప్పటి వరకు అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఏనాడు సకాలంలో ఫైరింజన్ చేరుకున్న దాఖలాలు లేవు. మండలం నుంచి సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు చేరుకునే లోపు బుగ్గిపాలైన సంఘటనలే ఉన్నాయి. జిల్లాలో ఒక్కటే అగ్నిమాపక కేంద్రం ఉండడంతో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే భూపాలపల్లి నుంచి వెళ్లాలి. గతంలో పరకాల అగ్నిమాపక కేంద్రం సేవలను అందించేది. మండలంలో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చే యడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.15లక్షల మేర నష్టం జరిగింది

ఇటీవల మా ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయాం. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందిస్తే ఇళ్లు మొత్తం కాలిపోయాక వచ్చింది. నష్టం జరిగాక వస్తే ఏం ఉపయోగం. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల మేర నష్టం జరిగింది.

– ఎద్ల రమణ, బాధితుడు

హనుమకొండకు వెళ్లాలంటే ఆటోలే దిక్కు

- మండలానికి రాని హనుమకొండ బస్సు
- ప్రైవేట్ వాహనాల్లో స్థానికుల ప్రయాణం
- గంటల తరబడి వేచిచూడాల్సిన దుస్థితి
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా శాయంపేట బస్‌షెల్టర్

శాయంపేట : మండలానికి హనుమకొండ బస్సు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో బస్ షెల్టర్ ఉన్నప్పటికీ శాయంపేట నుంచి హనుమకొండకు బస్సు సౌకర్యం లేక స్థానికులు ఆటోలో మాందారిపేట వరకు వెళ్లి అక్కడ బస్సుల కోసం గంటల తరపడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఉదయం నాలుగు గంటల నుంచి ప్రతి గంటకు ఒక బస్సు చొప్పున రాత్రి తొమ్మిది గంటల వరకు బస్సులు వచ్చేవి. నాలుగేళ్ల క్రితం మండలం నుంచి హనుమకొండకు బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారు. దీంతో ప్రజలు, మండలంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు ఇబ్బందులకు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపి బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మాందారిపేట స్టేజీ వద్ద బస్సులు ఆగేది లేదు

పరకాల నుంచి హనుమకొండకు వెళ్లే బస్సులు మాందారిపేట స్టేజీ వద్ద ఆపకుండా వెళ్లడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు మాందారిపేట స్టేజీపై ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.